సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 28 | నవంబర్ | 2023

కార్తీకం..శుభప్రదం

కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉసిరిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి లక్ష వత్తులు వెలిగించారు. గణపురం మండలం కోటగుళ్లలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దశ సహస్ర దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. - కాళేశ్వరం, గణపురం



సకల జనులకు సముచిత స్థానం

గిరిజనులు, ఆదివాసీలకు బీజేపీ ప్రాధాన్యం

- కురవి వీరభద్రుడి ఆశీస్సులు కోరుతున్నా
- తెలంగాణ ప్రజలు కమలం వైపు చూస్తున్నారు..
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- మానుకోట సకల జనుల విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ
- తెలుగులో ప్రసంగం ప్రారంభం.. పార్టీ శ్రేణుల్లో జోష్
- ఒక్క చాన్స్ ఇస్తే మార్పు చూపిస్తా: హుస్సేన్‌నాయక్



మానుకోటలో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, మహబూబాబాద్/ మహబూబాబాద్/ మహబూబాబాద్ అర్బన్: 'నా తెలంగాణ కుటుంబ సభ్యులకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు. కురవి వీరభద్ర స్వామి మందిరానికి శ్రద్ధాపూర్వక నమస్కారాలు.. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు తీసుకున్నాను. ఈ ప్రాంతం, రాష్ట్ర ప్రజలు బాగుండాలని కోరుకుని ఇక్కడికి వచ్చా.. ప్రజలు జనతా జనార్దనులు, ఈశ్వర సమానులు.. సభకు మీరందరూ రావడం సతోషం.. ఇక్కడ నూతన శకం ప్రారంభం కానుంది.. మహబూబాబాద్ ప్రాంతానికి సేవాలాల్ మహరాజ్ సమర్పణ తపస్సు ఫలం లభించింది.. సేవాలాల్ మహరాజ్‌కీ జై..' అంటూ దేశ ప్రధాని నరేంద్రమోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించి ప్రజలను ఉత్తేజ పరిచారు. బీజేపీ అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోందని, సకల జనులకు సముచిత స్థానం లభిస్తోందని అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సకల జనుల విజయ సంకల్ప సభ నిర్వహించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి హుస్సేన్ నాయక్‌తోపాటు డోర్నకల్, నర్సంపేట, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అభ్యర్థులు భూక్య సంగీత, పుల్లారావు, రవీంద్రనాయక్, బాలరాజు, కుంజ ధర్మాను బలపరుస్తూ సభకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. సభకు ప్రధాని మోదీ హాజరై బీజేపీ ప్రభుత్వాన్ని బలపర్చాలని, అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించా. పలువురు ప్రముఖులతో మాట్లాడా. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు' అని అన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అని, తెలంగాణకు అన్యాయం చేశాయన్నారు. నవంబర్ 30వ తేదీన ప్రజలువేసే ఓట్లతో ముఖ్యమంత్రి ఓడిపోతున్నారన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపించేది బీజేపీ ప్రభుత్వం ఒక్కటే అన్నారు. సభలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, రాజవర్ధన్‌రెడ్డి, ఎడ్ల అశోక్ రెడ్డి, రవీంద్ర నాయక్, బాలరాజు, ధర్మారావు, ప్రేమేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంచంద్రు, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



వేదికపై అభివాదం చేస్తున్న నరేంద్ర మోదీ, పక్కన అభ్యర్థులు హుస్సేన్‌నాయక్, సంగీత తదితరులు

అవకాశం ఇస్తే మార్పు చేసి చూపిస్తా: హుస్సేన్ నాయక్



ఒక్కసారి తనకు అవకాశం కల్పిస్తే మానుకోట నియోజకవర్గం మార్పు చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో దోపిడీ, అరాచకాలు పెరిగాయని, దీంతోపాటు భూకబ్జాలు జరిగాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లేనన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత పీఎం మోదీది అన్నారు.

బీఆర్ఎస్ అరాచక పాలనకు చరమగీతం పాడాలి: భూక్య సంగీత



డోర్నకల్ నియోజకవర్గంలో రెడ్యానాయక్ కుటుంబ పాలన సాగుతోందని బీజేపీ అభ్యర్థి భూక్య సంగీత అన్నారు. రెడ్యానాయక్ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. 40 ఏళ్ల ప్రజా ప్రతినిధిగా ఉన్న రెడ్యానాయక్ డోర్నకల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. రెండు సార్లు జెడ్పీటీసీగా గెలిపించిన మీరు ఈ సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

సైడ్‌లైట్స్..

- ప్రధాని మోదీ మానుకోట సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 12.49 గంటలకు చేరుకోగా 12.51కి హెలికాప్టర్ ల్యాండ్ అయింది.
- మధ్యాహ్నం 1.02 గంటలకు మోదీ వేదిక పైకి చేరుకున్నారు. 1.13 నుంచి 1.50 గంటల వరకు ప్రసంగించారు.
- ఇప్పటివరకు మానుకోటకు పీఎం హోదాలో మోదీ మాత్రమే వచ్చారు. గతంలో ఇందిరాగాంధీ వచ్చినప్పటికీ ఆమె అప్పుడు పీఎం హోదాలో లేరు.
- మోదీ రాకతో భారత్‌మాతాకీ జై, జైశ్రీరాం నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.
- వేదికపై మొదట బీజేపీ డోర్నకల్ అభ్యర్థి సంగీత పీఎం మోదీకి శాలువా కప్పి సన్మానించి నమస్కరించారు. ఆమెకు పీఎం తిరిగి నమస్కరించారు. తర్వాత మానుకోట అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ కూడా మోదీని శాలువాతో సత్కరించి శ్రీరాముడి చిత్రపటం బహూకరించారు.
- చాలామంది వ్యాపారులు, మార్వాడీలు దుకాణాలను బంద్ చేసి కటుంబసభ్యులతో కలిసి మోదీ సభకు తరలివచ్చారు.
- పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు కూడా పీఎంను చూడడానికి రావడం గమనార్హం.

ప్రచారం.. నేటితో పరిసమాప్తం

సాయంత్రం 5 గంటల తర్వాత మైక్‌లు బంద్

- వివరాలు 6లో

కాంగ్రెస్‌తో ఇందిరమ్మ రాజ్యం



మరిపెడలో జరిగిన విజయభేరి సభకు హాజరైన జనం

జంగ్ తెలంగాణ

అక్కడ కేసీఆర్.. ఇక్కడ రెడ్యానాయక్

- ఇద్దరి పీడ విరగడవ్వాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి
- కృష్ణా జలాలతో డోర్నకల్ ప్రాంతం సస్యశ్యామలం చేస్తాం
- మరిపెడ విజయభేరి సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సభలో అభ్యర్థి రాంచంద్రునాయక్‌ను పరిచయం చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

మరిపెడ/ మరిపెడ రూరల్: రాష్ట్రానికి కేసీఆర్.. డోర్నకల్ నియోజకవర్గానికి రెడ్యానాయక్ పీడ ఈ ఎన్నికలతో విరగడవుతుందని.. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇందిరమ్మ రాజ్యమని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి రాంచంద్రునాయక్ గెలుపుకోసం మరిపెడలో సోమవారం నిర్వహించిన విజయభేరి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి వద్దకు ఉద్యోగం కోసం వస్తే సర్పంచ్, సమితి ప్రెసిడెంట్, ఎమ్మెల్యే, మంత్రి వరకు కాంగ్రెస్ పార్టీ పదవులు ఇస్తే వాటిని విస్మరించిన.. విశ్వాసం లేని నాయకుడు రెడ్యానాయక్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరుసార్లు కాంగ్రెస్ నుంచి గెలిచి ఈ ప్రాంత ప్రజలను మోసంచేసి స్వలాభం కోసం బీఆర్ఎస్‌లో చేరలేదా అని ప్రశ్నించారు. అక్కడ కేసీఆర్ కుటుంబం చాటలు పట్టుకొని పంచుకుంటుంటే.. ఇక్కడ రెడ్యానాయక్ కుటుంబ సభ్యులు చాటలు పట్టుకొని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక, బియ్యం దందాలు ఇలా అన్నింటిలో రెడ్యా కుటుంబం పాత్ర ఉందని ఆరోపించారు.

కృష్ణా జలాలతో సస్యశ్యామలం

తలాపున కృష్ణా నది ఉన్నా సాగునీటికి డోర్నకల్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు కృష్ణా జలాలను అందించి సాగునీటి ఇబ్బంది తీరుస్తామని అన్నారు. ఇక్కడి ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి మార్గాలు లేవని అన్నారు. రాంచంద్రునాయక్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి జరిగేలా చూస్తానన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో బడులకు పోవాల్సిన యువకులు ఒక చేత బీఆర్ఎస్ జెండా, మరోచేత బీరు సీసాలతో తిరుగుతున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో మద్యం ఏరులై పారుతుందన్నారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా రాంచంద్రునాయక్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మురళీనాయక్, నూకల శ్రీరంగారెడ్డి, నెహ్రూనాయక్, మరిపెడ మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, యుగేందర్‌రెడ్డి, అంబరీష, అప్సర్, ముదిరెడ్డి నరేష్‌రెడ్డి, కమలాకర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

సేవ చేసే భాగ్యం కల్పించాలి : కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థి రాంచంద్రునాయక్



'నేను డాక్టర్‌గా స్థిరపడ్డా.. డోర్నకల్ ప్రజలపై అభిమానంతో రెండు పర్యాయాలు రెడ్యానాయక్‌పై పోటీ చేశా' అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంచంద్రునాయక్ అన్నారు. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మరిపెడలోనే ఆస్పత్రి కట్టించి, నేను, నా భార్య ఇక్కడి ప్రజలకు సేవ చేస్తామన్నారు. మీకు సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు.

కల్లబొల్లి మాటలు నమ్మొద్దు..





ఏటూరునాగారంలో జరిగిన రోడ్‌షోకు హాజరైన జనం, మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన అభ్యర్థి బడే నాగజ్యోతి, మంత్రి సత్యవతి రాథోడ్

- తల్లికి బువ్వ పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు కొనిస్తా అంటే ఎలా?
- కాంగ్రెస్ పార్టీవి మోసపూరిత వాగ్దానాలు
- గత ఎన్నికల్లో ఓడిపోయినా ములుగుపై ప్రేమతో జిల్లా ఏర్పాటు
- బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని గెలిపిస్తే మరింత అభివృద్ధి
- ఏటూరునాగారం రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

ఏటూరునాగారం: 'తల్లికి బువ్వ పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు కొనిస్తా అంటే ఎలా? కాంగ్రెస్ నాయకులు మోసపూరితమైన వాగ్దానాలు చేస్తున్నారని, వారి కల్లబొల్లి మాటలు నమ్మొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి, ఆదివాసీ ముద్దు బిడ్డ బడే నాగజ్యోతిని భారీ మెజారిటీతో గెలిపించి ములుగు నియోజకవర్గ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాగజ్యోతిని గెలిపిస్తేనే ములుగు అభివృద్ధికి మరింత కృషి చేస్తామని, లేకపోతే లేదన్నారు. 'ముళ్ల చెట్టుకు నీళ్లు పోసి పండ్లు రావాలంటే వస్తాయా..? యుద్ధంలో కత్తి వేరే వారికి ఇచ్చి ఒట్టి చేతులతో మమ్ములను కదనరంగంలో దూకమంటే ఎలా? రైతుల నోటికాడి బుక్క ఆగం చేసింది రేవంత్‌రెడ్డి కాదా? రైతుబంధు ఆపిన ద్రోహి రేవంత్‌రెడ్డి కాదా' అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సీతక్క తల్లిదండ్రులకు సైతం పోడు భూముల పట్టా ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని ఓడించినా ములుగు నియోజకవర్గంపై ప్రేమతో ప్రజల సంక్షేమం కోసం జిల్లా ఏర్పాటు చేశామని, మెడికల్ కాలేజీ, 200 పడకల ఆస్పత్రి వస్తుందన్నారు. మల్లంపల్లిని మండలంగా ప్రకటిస్తూ, ఏటూరునాగారం అటవీ ప్రాంత ప్రజల బాగోగులు చూసుకునేందుకు రెవెన్యూ డివిజన్, డయాలసిస్ సెంటర్, తలసేమియా వ్యాధి నిర్మూలనకు కృషి చేశామన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వృద్ధులు, వితంతువులకు ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా, దళితుల అభివృద్ధికి ప్రత్యేక దళితబంధు పథకాలు అమలు చేశామన్నారు. ఈసారి ప్రభుత్వం ఏర్పాటైన తక్షణమే గిరిజనులకు గిరిజన బంధు, ఆదివాసీల ఆరాధ్య దైవాలైన సమ్మక్క- సారలమ్మ జాతర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తేవడంలో కేసీఆర్ పాత్ర ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలతో ఓటు పొందాలని అత్యాశపడుతున్నారని, కాంగ్రెస్, బీజేపీకి ఓటు ద్వారా ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ధరణి తీసి దళారీ వ్యవస్థ తెస్తాడటా?

కేసీఆర్ పెట్టిన ధరణితో ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఒక్కరోజులో భూమి రిజిస్ట్రేషన్, మార్పులు, చేర్పులు అవుతున్నాయని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్క మాత్రం ధరణి తీసివేసి మళ్లీ దళారీ వ్యవస్థ, పట్వారీ, లంచాల వ్యవస్థ తెస్తామంటున్నారని, అదే జరిగితే మళ్లీ రైతులు అరిగోస పడతారన్నారు. ఇలాంటి వాళ్ల పాలన మనకు అవసరం లేదన్నారు. దొడ్డు బియ్యం ఇస్తే అవి రూ.15కు పక్కదారి పడుతున్నాయని, పేదల కోసం అన్నపూర్ణ పథకం కింద సన్న బియ్యం ఇస్తామన్నారు. కోడళ్లకు సౌభాగ్యలక్ష్మి పథకం పేరుతో రూ.3వేలు ఇస్తామన్నారు. రూ.400కు గ్యాస్ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, స్థానిక ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, ఎంపీటీసీలు కోట నర్సింహులు, జాడి లక్ష్మీనారాయణ, దివంగత జెడ్పీ చైర్మన్ జగదీష్ భార్య రమాదేవి, సప్పిడి రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఆశీర్వదించి గెలిపించాలి : బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి



ఒక్కసారి ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి ప్రజలను వేడుకున్నారు. సీఎం కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పేదింటి బిడ్డను నన్ను గెలిపిస్తే మీవెన్నంటే ఉంటూ సేవ చేసుకుంటానన్నారు. కొండాయి బ్రిడ్జి, కరకట్ట నిర్మాణం, ఇతర సమస్యలను కేటీఆర్‌కు వివరించానన్నారు. 30వ తేదీన మూడో నంబర్‌లో ఉన్న కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



మానుకోటలో జరిగిన సకల జనుల విజయసంకల్ప సభలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ





ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్, నృత్యం చేస్తున్న కళాకారులు



మరిపెడలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో నృత్యం చేస్తున్న గిరిజనులు

ప్రచార హోరు..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రచారం హోరెత్తింది. మూడు ప్రధాన పార్టీల నుంచి అగ్ర నాయకులు హాజరుకావడంతో ప్రచారం ఉధృతంగా సాగింది. మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో రాష్ట్ర మంత్రి కేటీఆర్, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

భూపాలపల్లి అర్బన్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు అభయ్ నందన్ అంభస్తా అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు అభయ్ నందన్ అంభస్తా, పోలీస్ పరిశీలకులు అమిత్ కుమార్, వ్యయ పరిశీలకులు కౌశిక్ రాయ్ పోలింగ్ నిర్వహణకు భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ్ నందన్ అంభస్తా మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ట భద్రత కల్పించాలని అన్నారు. గతంలో భూపాలపల్లి మావోయిస్టు పరివాహక ప్రాంతమని, ఇక్కడ పటిష్టంగా భద్రత కల్పించి సజావుగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈవీఎం యంత్రాలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి రిసెప్షన్ కేంద్రానికి తరలించే సమయంలో అవసరమైన మేర ఎస్కార్ట్ కల్పించాలని అన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని చెప్పారు. 11 ఆర్‌ఓపీలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది సామగ్రి భద్రత కోసం నైట్ హాల్ట్‌లను ఏర్పాటు చేయాలన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎన్నికల పరిశీలకులు

ఈవీఎంల తరలింపు రోడ్లను మూడు దశలలో పరిశీలించాలని అన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాలో 317 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు వల్లారబుల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు.

ఎస్పీ కిరణ్ ఖారే మాట్లాడుతూ..

26 రూట్లలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో 26మంది హెడ్ కానిస్టేబుళ్లు, 84మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 56మంది హోంగార్డులు, 184 మంది సీజే హోం గార్డుల, 252 మంది కేంద్ర బలగాల సేవలు వినియోగించుకుంటున్నామని అన్నారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎం యంత్రాలు తరలింపు కోసం అవసరమైన భద్రత ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

ఈ నెల 29, 30 తేదీల్లో పత్రికలలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనల జారీకోసం ముందస్తుగా జిల్లా కేంద్రంలోని ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నియోజకవర్గంలో పోలింగ్ ముగింపు సమయానికి 48గంటల ముందు నుంచి అనగా నేడు (మంగళవారం) సాయంత్రం 4 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ పాటించాలన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలులేదని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల సర్వే వివరాలను వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకొని వెళ్లడం నిషేధించినందున, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కీలకంగా పట్టణ ఓటర్లు

భూపాలపల్లిలో దాదాపు 50వేల మంది

- ఓటర్లకు నగదు, నజరానాలు

భూపాలపల్లి అర్బన్: ఎన్నికల్లో అభ్యర్థుల తలరాతలను భూపాలపల్లి పట్టణ ఓటర్లు శాసించనున్నారు. జిల్లాలో ఉన్న ఏకైక పట్టణం భూపాలపల్లి. దీంతో ఈసారి భూపాలపల్లి పట్టణం ఓటర్లు ఎవరిని దయ తలుస్తారో అని నియోజకవర్గ ప్రజలు అనుకుంటున్నారు. దాదాపు మండలాలతో పోలిస్తే పట్టణాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండడంతో అభ్యర్థుల దృష్టి పట్టణ ఓటర్లపై పడింది. ఈ సారి పట్టణ ఓటర్లు తమను మంచుతారో తేల్చుతారోనని అందరి మదిలో ఉత్కంఠ నెలకొంది. గతంలో జరిగిన ఎన్నికల్లో పట్టణ ఓటర్లే డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా మారడంతో ఈసారి ఎటువంటి అలసత్వానికి తావువివ్వకుండా నేతలు పావులు కదిపారు.

ఎటు మొగ్గుతారో..?

పట్టణ ప్రాంత ఓటర్లు ఈసారి ఏవైపు ఉంటారనేది అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న. గతంలో పట్టణంలోని ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపితే అటువైపు విజయం వరించింది. ఈసారి భూపాలపల్లి పట్టణంలో దాదాపు 50 వేల మందికిపైగా ఓటర్లు ఉన్నారు. దీంతో వీరు ఏ పార్టీవైపు మొగ్గితే అటే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో గెలిచిన పార్టీకి, ఓడిన పార్టీకి అంతరంగా పట్టణ ఓటర్లు ఉన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉండడంతో పట్టణ ఓట్లు కీలకంగా మారాయి. పట్టణంలో విద్యావంతులు, వ్యాపారస్తులు అధిక సంఖ్యలో ఉండటం కూడా ఓటింగ్‌పై ప్రభావం చూపించే అవకాశం ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదువుతున్నవారు, ఉద్యోగస్తులు ఇప్పటికే పట్టణానికి చేరుకున్నారు. వీరు ఏవైపు మొగ్గుచూపుతారనే విషయం ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగానే ఉంది.



ఓట్ల కోసం ప్రలోభాలు..

భూపాలపల్లి పట్టణంలోని ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకుంటే విజయం సాధించవచ్చని అన్ని పార్టీలూ అనుకుంటున్నాయి. పట్టణంలోని బూత్‌ల వారీగా ప్రధాన పార్టీలు పోలింగ్‌కు మూడు రోజుల ముందు నుంచే ఓటర్లకు నగదు, మద్యాన్ని ఎరగా వేసి ఓట్లు సాధించాలని అనుకున్నారు. ఇప్పటి నుంచే కొంతమంది ఓటరు జాబితాను దగ్గర పెట్టుకుని కాలనీల్లో తిరుగుతున్నారు.

ఓటును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి

చిట్యాల: ఈ నెల 30 జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ రాములు కోరారు. సోమవారం మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణలో ఏర్పాటుచేసిన పోలీస్ క్యాంపు కార్యాలయంలో టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన కేంద్ర బలగాలకు, స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో గట్టి భద్రత నిర్వహించాలని కోరారు. అనంతరం మండలకేంద్రంలోని చౌరస్తాలో పోలీస్ కవాతు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ దాసారపు వేణు చందర్, ఎస్సైలు జంగిలి రమేష్, శ్రీధర్, సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డప్పులు సీజ్

కాటారం: కాటారం మండలం గంగారంలోని కోళ్లఫాం సమీపంలో నిల్వ చేసిన సుమారు 75 డప్పులను సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. డప్పులు నిల్వ చేశారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ అధికారులు 75 డప్పులను గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో మంథని రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు డప్పులను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. డప్పులపై పేరు, పార్టీ గుర్తు లేకపోవడంతో విచారణ కొనసాగించి ఆర్‌ఓ సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అదే గ్రామంలో సత్తక్క అనే మహిళ ఇంట్లో నిల్వ చేసిన 10 బీర్లు, 10 ఆఫ్ మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎఫ్‌ఎస్‌టీ బృందం హెడ్ సత్యబాబును సాక్షి వివరణ కోరగా డప్పులు పట్టుకున్నామని.. వాటిపై ఎలాంటి పార్టీ గుర్తు, పేరు లేదని తెలిపారు.

బూత్ కమిటీలే కీలకం

- అభ్యర్థుల గెలుపోటముల్లో వీరిదే ప్రధాన పాత్ర
- బలాబలాలు తెలియజేసేది బూత్ కమిటీలే..

భూపాలపల్లి అర్బన్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మరో రెండు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. అభ్యర్థులు దాదాపు 40రోజుల పాటు ప్రచారంలో ఉన్నప్పటికీ ఈ రెండు రోజులే కీలకంగా భావిస్తున్నారు. ప్రస్తుతం నాయకుల భవిష్యత్ బూత్ లెవల్ కార్యకర్తలపై ఆధారపడి ఉంది. రోజంతా ప్రచారం చేస్తున్నప్పటికీ రాత్రి 10తర్వాత బూత్ లెవల్ కమిటీలపై ఓ లుక్కేస్తున్నారు. బూత్‌లెవల్ కమిటీలతో చర్చిస్తూ ఎంతమంది ఓటర్లు తమకు ఓటు వేస్తారనే విషయంపై ఆరా తీస్తున్నారు. 317 పోలింగ్ బూత్‌లు ఉంటే వీటన్నింటికీ ప్రతీ పార్టీ బూత్‌కు కమిటీలను ఏర్పాటు చేసుకుంది.

విజయానికి కీలకం..

బూత్ లెవల్‌లో ఉన్న బలాబలాల గురించి పార్టీలకు వివరించడంతో బూత్ లెవల్ కమిటీలే కీలకం. ప్రతీ పార్టీ బూత్ లెవల్‌లో కమిటీని ఏర్పాటు చేసుకుంది. ఇటు భూపాలపల్లి, అటు మంథని నియోజకవర్గ పరిధిలోని పార్టీలు బూత్ లెవల్ కమిటీలతో చర్చిస్తున్నాయి. పోల్ మేనేజ్‌మెంట్‌లో బూత్ కమిటీలే కీలకంగా మారాయి. తమకు అనుకూలంగా ఓట్లు వేయించే బాధ్యత వారిదే కావడంతో ప్రధాన పార్టీలన్నీ ప్రస్తుతం వాటిపై దృష్టి సారించాయి. తమ పోలింగ్ బూత్ పరిధిలో ఎన్ని ఓట్లు ఉన్నాయి. ఎంతమంది ఎటు వేస్తారనేది వీరికే స్పష్టంగా తెలియడంతో వీరిపైనే ప్రస్తుతం నేతలు ఆధారపడి ఉన్నారు. ఇన్నాళ్లు ప్రచారంలో కార్యకర్తలను వెంటేసుకుని తిరిగినప్పటికీ ఇప్పుడు మాత్రం బూత్ స్థాయిలో పనిచేస్తున్న వారిని కీలకంగా భావిస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌లో బిజీగా నేతలు

ప్రచారం తుది అంకానికి చేరుకోవడంతో నేతలందరూ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. నేటితో ప్రచారం ముగియనుండటంతో నేతలందరూ బూత్‌స్థాయిలో దృష్టి పెట్టనున్నారు. ఇప్పటికే బూత్ స్థాయిలో సమీక్షలు జరుపుతున్నప్పటికీ ఈ అంశంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నారు. తమకు పట్టులేని ప్రాంతాల్లో ఉన్న బూత్‌లపై ప్రణాళికాబద్ధంగా నేతలు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే బూత్‌ల వారీగా ఓటరు లిస్టును తీసుకుని అందులో ఏపార్టీకి ఎన్ని ఓట్లు పడుతాయి.. ఏ పార్టీకి సంబంధం లేకుండా ఉన్న తటస్థ ఓటర్లు ఎందరనే విషయంపై లెక్కలు వేసుకుంటున్నారు. తటస్థంగా ఉన్న ఆయా ప్రాంతాల్లో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు తాయిలాలు ప్రకటిస్తున్నారు. ఆయా బూత్‌ల్లో తమకు వ్యతిరేకంగా వేరే పార్టీలకు అనుకూలంగా ఉన్న వారికి నజరానాలు అందించేందుకు నేతలు సమయత్తం అవుతున్నట్లు సమాచారం. బూత్ కమిటీకి రోజుకు ఇతరత్రా ఖర్చులు రూ.5వేల నుంచి రూ.10వేలు ఇస్తున్నట్లు సమాచారం.

సాయుధ బలగాల కవాతు

కాటారం: ప్రజలకు తాము అండగా ఉన్నామని స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ కాటారం మండల కేంద్రంలో సోమవారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సివిల్, కేంద్ర బలగాలకు చెందిన జవాన్లు పుర వీధుల గుండా ప్రదర్శన ఇచ్చారు. భయం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని డీఎస్పీ సూచించారు. ప్రజల రక్షణ, ప్రశాంత ఎన్నికల నిర్వహణ తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు అభినవ్, సుధాకర్, సురేశ్, సివిల్, కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బ్యాలెట్ ఓటేసిన ఉద్యోగులు



ఓటు హక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయులు


టేకుమట్ల: మండలంలోని ఉద్యోగులు సోమవారం జిల్లాకేంద్రంలో పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నారు. మండలంలో పనిచేస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ, మండల పరిషత్, తదితర శాఖలకు చెందిన ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా

వాజేడు: మావోయిస్టుల కదలికలపై డ్రోన్ కెమెరాతో పరిసర ప్రాంతాలపై నిఘా పెట్టినట్లు పేరూరు ఎస్సై రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని పలు ప్రాంతాలను సోమవారం డ్రోన్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టులు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించినట్లు ప్రకటించారని తెలిపారు. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి డివిజన్ కమిటీకి చెందిన కొంతమంది మావోయిస్టులు తెలంగాణ సరిహద్దు, గోదావరి దాటడానికి ప్రయత్నిస్తున్నట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిందని తెలిపారు. జేఎండబ్ల్యూపీకి చెందిన మావోయిస్టు యాక్షన్ టీమ్ కదలికలను తెలుసుకోవడానికి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాలతో పాటు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అన్నా.. ఎవరు గెలుస్తరే..

- అభ్యర్థులపై జోరుగా అంచనాలు
- నియోజకవర్గంలో పెరుగుతున్న బెట్టింగులు



భూపాలపల్లి అర్బన్: మొన్నటివరకు అన్నా.. టికెట్ ఎవరికి వస్తదే.. అని చర్చించుకున్నవారు.. ప్రస్తుతం మన భూపాలపల్లి నుంచి ఎవరు గెలుస్తరని ఎడతెగని ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ. భూపాలపల్లి, గణపురం, చిట్యాల, రేగొండ, కాయంపేట, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని ప్రధాన సెంటర్లు, హోటళ్లు, పాన్‌షాపులు, మద్యం దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, కిరాణాల వద్ద భూపాలపల్లి రాజకీయంపైనే చర్చ కొనసాగుతోంది.

అటుగా వెళ్తున్న వారిని ఆపి..

- అటుగా వెళ్తున్న పరిచయస్తులను ఆపి మరీ మీ ఏరియాలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయి, ఎవరు గెలుస్తారు? అని పిలిచి చర్చించి, ప్రశ్నించి వివరాలు తెలుసుకుంటున్నారు.
- ముఖ పరిచయం ఉన్నవాళ్లు, తెలిసిన వాళ్లు చర్చించుకుంటున్నారంటే ప్రధాన కూడలిలో మాత్రం పరిచయం లేనివాళ్లతో మాటామాట కలిపి ఎన్నికల వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.
- పక్క నియోజకవర్గాల వారితో కూడా మాటలు కలిపి సమాచారం అడిగి తెలుసుకుంటున్నారు.
- నియోజకవర్గంలోని ఏ గ్రామాల్లో ఏ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయి? ఎవరు గెలుస్తారనే అంశాలపై జోరుగా చర్చించుకుంటున్నారు.
- అవతలి వ్యక్తి ఏ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారో అడిగి మరీ తెలుసుకుంటున్నారు. అయితే ఈ చర్చలు ఎవరిని ఉద్దేశించినవిగా చెప్పడం లేదు.
- ఎవరికివారే గెలిస్తే మాకేంటీ? రోజూ మనం చేసే పనైతే తప్పదు కదా? అంటూ మళ్లీ మాటలు దాటవేస్తున్నారు.


అభ్యర్థులపై అంచనాలు..

పోలింగ్ తేదీ సమీపిస్తున్న క్రమంలో నియోజకవర్గంలో రాజకీయ వేడి పెరుగుతోంది. ప్రధాన పార్టీల తరఫున పోటీచేస్తున్న అభ్యర్థుల పేర్లతో జోరుగా బెట్టింగులు కడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివిధ కార్యకలాపాలపై పట్టణ కేంద్రంగా కొందరు తరచూ వీటికి అలవాటు పడ్డారు. ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారు? ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని పందెం కాస్తున్నారు. అది రూపాయల నుంచి రూ.లక్షల్లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ఉన్న చోటామోటా నాయకుల నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థుల వరకూ ఎన్నికలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ అక్రమ బెట్టింగులపై పోలీసుల నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఓటర్లు అంటున్నారు.

ప్రచారం.. నేటితో పరిసమాప్తం!

సాయంత్రం 5 గంటల తర్వాత మూగనోమే..

- ఒక్కరోజు ముందుగానే పోటెత్తిన అగ్రనేతలు
- ప్రధాని మోదీ, రేవంత్ రెడ్డి, కేటీఆర్, అస్సాం సీఎం తదితరులు
- నేడు వరంగల్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్



వరంగల్‌లో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ కోసం సిద్ధమవుతున్న వేదిక

సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఎన్నికల నోటిఫికేషన్‌నుంచే అభ్యర్థులు ప్రచారం చేస్తున్నా.. ఈ నెల 15న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ప్రచారం ఊపందుకుంది. 20వ తేదీ నుంచి ఉమ్మడి వరంగల్‌కు అగ్రనేతలు వరుసకట్టడంతో ప్రచారం పతాకస్థాయికి చేరింది. అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాన పార్టీల క్యాంపెయినర్లు, అగ్రనేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. విజయమే లక్ష్యంగా అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు చెమటోడ్చారు. రోజూ నేతల రోడ్‌షోలు, సమావేశాలు, మైకుల మోతలతో ఉమ్మడి జిల్లా హోరెత్తింది. ప్రచారం ముగింపునకు ఒక్కరోజు ముందుగానే అగ్రనేతలు పోటెత్తారు. సోమవారం భారత ప్రధాని నరేంద్రమోదీ మహబూబాబాద్‌లో, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ పరకాలలో, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి డోర్నకల్ నియోజకవర్గంలో, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఏటూరు నాగారంలో రోడ్‌షోలు, సభలు నిర్వహించారు. ప్రముఖుల రాకతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. సుమారు 13 రోజులపాటు ఉధృతంగా సాగిన ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు పరిసమాప్తం కానుంది. చివరి రోజు మంగళవారం న ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగసభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో ప్రచారం ముగింపు తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు వ్యూహరచనలో నిమగ్నం కానున్నారు. నోటిఫికేషన్ తర్వాత విస్తృతంగా నియోజకవర్గాల్లో పర్యటించినప్పటికీ ప్రతికూల పరిస్థితులున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పోల్ మేనేజ్‌మెంట్‌పై నజర్ పెట్టిన ప్రధాన పార్టీలు ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వ్యూహాలు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

మద్యం షాపులు మూడు రోజులు బంద్

కాజీపేట అర్బన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూడు రోజులు మద్యం షాపులు బంద్ చేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి గురువారం సాయంత్రం 5 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య

టేకుమట్ల: అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన అచ్చె రజిత(41) తనకున్న 2 ఎకరాల 10 గుంటల భూమితో పాటు 6ఎకరాల భూమిని కౌలుకు తీసుకుంది. భర్త రాజేందర్‌తో కలిసి పత్తి, మిరప, వరిపంటను సాగు చేస్తుంది. పెట్టుబడి కోసం సుమారు రూ.3లక్షల మేర అప్పులు పెరిగిపోయాయి. అప్పులెలా తీర్చాలనే తీవ్ర మనస్తాపంతో ఆదివారం పంటచేనులోనే పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల రైతులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.



రజిత (ఫైల్)

గోదావరికి ‘పంచ హారతి’



కాళేశ్వరంలో త్రివేణి సంగమ గోదావరికి పంచ హారతిని ఇస్తున్న వేద పండితులు

కాళేశ్వరం: కార్తీకమాసం పంచరత్నాల్లో భాగంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఐదవ రోజు త్రివేణి సంగమ గోదావరి నదికి ‘పంచహారతి’ పూజా కార్యక్రమాన్ని అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. సోమవారం ముందుగా ప్రధాన ఆలయం నుంచి త్రివేణి సంగమ గోదావరి నదికి కాలినడకన మంగళవాయిద్యాలతో వేద మంత్రోచ్చరణల నడుమ తరలి వచ్చారు. గోదావరి మాతకు ప్రత్యేకంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గోదావరిమాతకు పాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమతో పాటు సారెను సమర్పించారు. అనంతరం వేదపండితులతో పంచ హారతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తజనం తరలి వచ్చారు. మహిళలు గోదావరి మాతకు దొప్పలలో కార్తీక దీపాలు వదిలారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, శ్యాంసుందర్ దేవుడా, ఎంపీటీసీ మమత, దేవస్థానం అర్చకులు ప్రశాంత్‌శర్మ, బైకుంఠపాండా, సుబ్రమణ్యశర్మ, రామకృష్ణశర్మ, శరత్‌చంద్రశర్మ, రాజరాజేశ్వర సేవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు

